# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 24 । డిసెంబర్ । 2022






### హక్కులపై అవగాహన అవసరం
కొనుగోలు, సేవలు పొందే ప్రతిఒక్కరూ వినియోగదారులేనని, వీరంతా హక్కులపై అవగాహన పొందాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అన్నారు. IIలో



### పర్యాటక ప్రాంతం పరిశుభ్రంగా..
పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత లక్ష్యంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. IIలో



### ఉత్సాహంగా.. ఉల్లాసంగా
యలమంచిలి రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఆరో అంతర్ జిల్లాల సబ్ జూనియర్ వాలీ బాల్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. IIలో

## న్యూస్‌రీల్

### పాలకమండలి సభ్యురాలిగా ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం



ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ జానకిరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాలకమండలి సభ్యురాలు, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

**సాక్షి, పాడేరు:** తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలుగా ఇటీవల నియమితులైన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. విద్యాలయంలో జరిగిన పాలకమండలి సమావేశంలో పాల్గొన్న ఆమె ఉద్యాన వీసీ జానకిరామ్,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, చింతలపూడి ఎమ్మెల్యే వి.ఎలైజ, పాలకమండలి సభ్యులకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. రైతుల ఉత్పత్తులు, మొక్కల ప్రదర్శనను ఆమె తిలకించారు. రైతులకు ఆదాయ భద్రత కల్పించే ఉద్యానవన పంటల విస్తరణకు చర్యలు తీసుకోవాలని పాలకమండలి సమావేశంలో కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

### చురుగ్గా 'జోలాపుట్టు' తారు రోడ్డు పనులు



జోలాపుట్టు జలాశయ మార్గంలో జరుగుతున్న తారు రోడ్డు పనులు

**ముంచంగిపుట్టు:** ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన జోలాపుట్టు జలాశయానికి వెళ్లే మార్గంలో తారు రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా జలాశయానికి వెళ్లే మార్గం గోతులమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన జెన్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం జోలాపుట్టు జలాశయానికి రెండు వైపులా రెండు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మిస్తుండటంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### జాతీయస్థాయి పోటీలకు ఫిజికల్ డైరెక్టర్ భిక్షం



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పీడీ భిక్షం

**చింతూరు:** రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడం ద్వారా స్థానిక గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ భిక్షం జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 16,17 తేదీల్లో నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో 60 ప్లస్ కేటగిరీలో హైజంప్, డిస్కస్ త్రోలో ప్రథమ, హేమర్ త్రోలో ద్వితీయస్థానం సాధించారు. తద్వారా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కోల్‌కతాలో జరిగే జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఆయన అర్హత పొందారు.

### 108లో సుఖ ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎన్‌టీ రామకృష్ణ

**జి.మాడుగుల:** పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. మండలంలోని బొయితిలి పంచాయతీ మండిభ గ్రామానికి చెందిన కొర్ర సాల్మా శుక్రవారం పురిటినొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వాహనంలో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో పులుసుమామిడి గ్రామ సమీపాన ఆడశిశువును ప్రసవించినట్టు ఈఎన్‌టీ రామకృష్ణ, పైలెట్ లక్ష్మణరావు తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు. తల్లీబిడ్డలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం నిమిత్తం తరలించినట్టు వారు పేర్కొన్నారు.

# చరిత్రకు సాక్ష్యం

ఏజెన్సీలో మొట్టమొదట క్రైస్తవ ప్రార్థన మందిరం అరకులోయ మండలంలోని సుంకరమెట్టపై నిర్మితమైంది. క్రైస్తవ ప్రార్థనలు సీబీఎం ఆధ్వర్యంలో 1939 నుంచి ఇక్కడ ప్రారంభమయ్యాయి. ఎంతో ఘన చరిత్ర గల ఈ చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది.



సుంకరమెట్ట చర్చి

- సుంకరమెట్ట పురాతన చర్చి
- 1939లో నిర్మించిన కెనడా దేశస్తుడు రాల్ఫ్‌స్మిత్
- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

**సాక్షి,పాడేరు:** ఏజెన్సీలో ఎంతో చరిత్ర కలిగిన పురాతన సుంకరమెట్ట చర్చిని కెనడా దేశానికి చెందిన వైద్యుడు రాల్ఫ్‌స్మిత్ నిర్మించారు. 1934లో ఆయన మిషనరీ ద్వారా క్రైస్తవ బోధనల నిమిత్తం ఏజెన్సీకి వచ్చారు. అయితే అప్పట్లో బ్రిటీషు పాలకులు ఎస్.కోట నుంచి అనంతగిరి మీదుగా అరకులోయ వరకు మట్టిరోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో సుంకరమెట్ట ప్రాంతానికి చేరుకున్న రాల్ఫ్‌స్మిత్, పెదగంగుడి, సుంకరమెట్ట గిరిజనులతో మమేకం అయ్యారు.

**గిరిజనులకు సేవచేస్తూ..**

మలేరియా, డయేరియా వంటి అనారోగ్య సమస్యలతో సుంకరమెట్టతో పాటు సమీప గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడేవారు.ఈ పరిస్థితుల్లో రాల్ఫ్‌స్మిత్ వైద్యం అందిస్తూ గిరిజనులకు సేవచేయడంతో పాటు, క్రైస్తవ బోధనలు చేసేవారు. అయితే ఇక్కడ ప్రార్థనమందిరం నిర్మించాలని తలచిన ఆయన గిరిజనులను సమాయత్త పరిచారు. క్రైస్తవ ఆరాధనలో నిమగ్నమైన స్థానిక గిరిజనులు కూడా చర్చి ఏర్పాటుకు సమ్మతించారు.

**జైపూర్ మహారాజ్ అనుమతులతో..**

ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న ఒడిశాలోని జైపూర్ మహారాజులకు గిరిజనులతో కలిసి డాక్టర్ రాల్ఫ్‌స్మిత్ చర్చి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విన్నవించుకున్నారు. కొద్ది రోజుల తరువాత జైపూర్ మహారాజు విక్రమ్‌దేవ్ చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో రాల్ఫ్‌స్మిత్, సొంత నిధులతో సుంకరమెట్ట రోడ్డుకు అనుకుని ఉన్న కొండ ప్రాంతంలో చర్చి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్తీక్ బెంజమన్‌దాస్, శామ్యూల్‌దాస్‌లు చర్చి నిర్మాణానికి స్థలం ఇవ్వడంతో అక్కడే చర్చి నిర్మితమైంది.

**సుంకరమెట్ట నుంచి క్రైస్తవ బోధనల విస్తరణ**

సుంకరమెట్టలో చర్చిని 1939 సెప్టెంబర్ 17వ తేదీన రాల్ఫ్‌స్మిత్ ప్రారంభించారు. అప్పటినుంచి ఏజెన్సీ వ్యాప్తంగా క్రైస్తవ బోధనలు విస్తరించాయి. 1954 వరకు రాల్ఫ్‌స్మిత్ ఈ చర్చిలోనే ప్రార్థనలు చేసేవారు. ఆ తరువాత ఈ చర్చిని కెనడీయన్ బాప్టిస్టు మిషన్(సీబీఎం)లో విలీనం చేశారు. వృద్ధాప్య దశలో ఉన్న రాల్ఫ్‌స్మిత్ తన కెనడా దేశానికి వెళ్లిపోయారు. కాకినాడ సీబీఎం చర్చికి చెందిన తాటికొండ విక్టర్ జోషఫ్ ఈ చర్చికి రావడంతో సీబీఎం ద్వారా ఏజెన్సీలో అన్ని చోట్ల ప్రార్థన మందిరాలను విస్తరించారు.

**ప్రత్యేకతలెన్నో..**

సుంకరమెట్ట చర్చి నిర్మాణంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అప్పట్లో మద్రాస్ నుంచి పెంకులు రప్పించారు. చెక్కసున్నం, రాళ్లను మెత్తగా చేసిన రాతిగుండతో అందమైన చర్చిని నిర్మించారు. ఇసుకను వాడకుండానే ఈ భవనం నిర్మించడం అప్పట్లో ఓ రికార్డుగా చెబుతుంటారు.

**ఆధ్యాత్మికంగా.. పర్యాటకంగా..**


పురాతన చర్చిగా గుర్తింపు పొందిన సుంకరమెట్ట ప్రార్థనా మందిరం పర్యాటక,ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది.అనంతగిరి–అరకులోయ ప్రధాన ఘాట్‌రోడ్డుకు అనుకుని ఎత్తయిన కొండపై సుంకరమెట్ట ప్రార్థన మందిరం అందంగా నిర్మితమైంది. ఈ మార్గంలో వెళ్లే పర్యాటకులు, ప్రయాణికులను ఎంతో ఆకర్షిస్తోంది. గత 85ఏళ్ల నుంచి ఈ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తుండగా, ఏటా క్రిస్మస్ వేడుకలను సంఘ పెద్దల ఆధ్వర్యంలో గిరిజనులంతా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా వేడుకలకు చర్చి ముస్తాబైంది.

## క్రిస్మస్ శోభ



పాడేరు వారపు సంతలో వస్త్ర దుకాణం వద్ద కొనుగోలుదారుల రద్దీ

**సాక్షి, పాడేరు:** జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో క్రిస్మస్ సందడి నెలకొంది. సుమారు 300 వరకు ప్రధాన క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఉన్నాయి. క్రిస్మస్ పురస్కరించుకుని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రంగురంగుల వెలుగుల్లో మెరిసిపోతున్నాయి. క్రిస్మస్ సందర్భంగా కొనుగోళ్లతో మండల కేంద్రాలు, వారపు సంతలతో కళకళలాడుతున్నాయి. అరకు, పాడేరు వారపుసంతల్లో దుస్తుల కొనుగోళ్లతో రద్దీ నెలకొంది. అలాగే క్రిస్మస్‌కు అవసరమైన స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలు, ఇతర అలంకరణ సామగ్రి అమ్మకాలు భారీగా జరిగాయి. జి.మాడుగుల–చింతపల్లి రోడ్డులోని రచ్చపల్లి సమీపంలో విద్యుత్ కాంతులతో శిలువ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



జి.మాడుగుల మండలం రచ్చపల్లి ప్రాంతంలో విద్యుత్ వెలుగులో శిలువ



చింతపల్లిలో ఐక్య క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల సందడి



పాడేరులో క్రిస్మస్ పండగ సామగ్రి అమ్మకాలు

# విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

**రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి**



గంగవరం పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

**గంగవరం :** ఏజెన్సీలో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గంగవరంలో రూ. 1.5కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజన్సీలో గిరిజన పేద ప్రజలకు ఆధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. పీహెచ్‌సీలన్నింటికి శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులభర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్‌ఎంపీపీలు రామతులసి, కుంజం గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మావతి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు ఏడుకొండలు, దిండిమహేష్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శారపు పావని, యువజన విభాగం అధ్యక్షుడు ఇరాట రమణయ్య పాల్గొన్నారు.

# అరకు రైల్వేస్టేషన్, బొర్రా గుహల అభివృద్ధికి వినతి

- ఆదర్శ్ పథకంలో చేర్చాలి
- రైల్వే మంత్రిని కోరినట్టు అరకు ఎంపీ మాధవి వెల్లడి



రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ మాధవి

**కొయ్యూరు:** అరకు రైల్వేస్టేషన్, బొర్రా గుహలను ఆదర్శ్ పథకంలో చేర్చాలని కోరుతూ అరకు ఎంపీ గొడ్డేటి మాధవి శుక్రవారం రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఢిల్లీ రైల్వే భవన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. పర్యాటకులు అధికంగా వస్తున్నందున వీటిని ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి కిరండోల్‌కు మంజూరైన రెండో రైల్వే ట్రాక్ నిర్మాణ పనులను బొర్రా గుహల వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఎంపీ తెలిపారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక చోట్ల రైల్వే అండర్‌గ్రౌండ్ వంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు. వాటిపై వాల్తేరు డివిజన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్టు ఎంపీ తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గంలో అక్కడ టౌన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను నియంత్రించేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్ వంతెన నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భాషా వలంటీర్లకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర సహాయమంత్రి అన్నపూర్ణదేవికి వినతిపత్రం అందజేసినట్టు ఎంపీ తెలిపారు. ఏటా అల్లూరి జిల్లాలో మాతృభాషా వలంటీర్లకు రూ.నాలుగు కోట్ల మేర నిధులు అవసరం అవుతాయన్నారు.721 మంది వలంటీర్లకు నిధులు మంజూరు చేయాలని కోరినట్టు ఎంపీ వెల్లడించారు.

# ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

- కేవీకే కోఆర్డినేటర్ లలితా కామేశ్వరి
- పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా రైతు దినోత్సవం



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ లలితా కామేశ్వరి

**రంపచోడవరం:** రైతులు అధిక రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ విధానంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి నాణ్యమైన ఆహారాన్ని సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్.లలితాకామేశ్వరి సూచించారు. పందిరిమామిడి కేవీకేలో శుక్రవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం– విస్తరణ కార్యాచరణకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బోర్డు సభ్యుడు పి.దేముళ్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రకృతి లేదా సహజసిద్ధమైన వ్యవసాయం అవసరమన్నారు. సేంద్రియ విధానంలో సాగు వల్ల దిగుబడి, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన ఎరువులతో సాగు మధ్య తేడాలను రైతులకు వివరించారు. ఆర్‌హెచ్‌డబ్ల్యూఈ విద్యార్థులు నాటిక ద్వారా రైతులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తల మధ్య చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.రాజేంద్రప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త భాస్కరరావు, పీపీఎం కేవీకే శాస్త్రవేత్తలు డా. ప్రవీణ్‌బాబు, రాజశేఖర్, వీరంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

**రైతులకు సత్కారం**

**ఎటపాక :** జాతీయ రైతు దినోత్సవ వేడుకలు శుక్రవారం గన్నవరంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి రైతులను సత్కరించారు. ఎటపాక సొసైటీ చైర్మన్ ఆకుల వెంకటరామారావు, కర్రి శ్రీనివాసరావు, ములిశెట్టి శ్రీను, ఆకుల దయాకర్, రఫీ, వెంకటరావు, పార్థసారథి, సొసైటీ సీఈవో దొంతు నాగేశ్వరావు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



వివరాలు తెలుసుకుంటున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

**దేవీపట్నం:** ప్రతి విద్యార్థికి అర్థమయ్యేయ రీతిలో విద్యాబోధన చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఇందుకూరు పంచాయితీలోని చినభీంపల్లి గ్రామంలో ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీపీ కుంజం మురళి, సర్పంచ్ కోసు లక్ష్మణ్ పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని పీవోను కోరారు. భవన నిర్మాణ వ్యయం వివరాలను ఇంజినీరింగ్ అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఎంఈవో మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర

**జీసీసీ ఎండీ సురేష్‌కుమార్**



కాఫీ గింజలను పరిశీలిస్తున్న ఎండీ సురేష్‌కుమార్

**అరకులోయ రూరల్:** వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని గిరిజన సహకార సంస్థ ఎండీ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన స్థానిక గిరిజన సహకార సంస్థ కార్యలయం, సోప్ యూనిట్లను సందర్శించారు. చొంపి పంచాయతీ డెర్ని, గెమ్మెలివలస తదితర గ్రామాల్లో కాఫీ రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు, రైతులు సేకరించిన కాఫీ, మిరియాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించిన పంటను గిరిజన సహకార సంస్థకు విక్రయిస్తేనే గిట్టుబాటు ధర వస్తుందన్నారు. ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కాఫీ పాచ్‌మెంట్ కిలో రూ.270, చెర్రీ కిలో రూ.135కు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. అరకు వారపు సంతలో రైతులు తీసుకువచ్చిన వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు.బయట వ్యక్తులకు కాకుండా గిరిజన సహకార సంస్థకు విక్రయించాలని కోరారు. జీసీసీ బ్రాంచి మేనేజర్ వెంకటేష్, కాఫీ సిబ్బంది, అప్పారావు, జన్ని సురేష్, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

**డీఎంహెచ్‌వో జమాల్‌బాషా**



పాడేరు జిల్లా ఆస్పత్రిలో రక్తనిధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

**పాడేరు రూరల్ :** సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బందితో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, ప్రసూతి, గర్భిణుల వార్డులు, బ్లడ్ బ్యాంకును పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులు, గర్భిణులు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను డీసీహెచ్ డాక్టర్ శంకర్‌ప్రసాద్ నుంచి తెలుసుకున్నారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. అనంతరం పాత బస్టాండ్‌లో నిర్వహిస్తున్న ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకునే జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి, పాడేరు సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్, జిల్లా టీబీ సూపర్‌వైజర్ వి.కిరణ్ పాల్గొన్నారు.

# స్పందన అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం
- 46 వినతుల స్వీకరణ

**పాడేరు రూరల్ :** స్పందన అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆర్. గోపాలకృష్ణ సూచించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి 46 అర్జీలు స్వీకరించారు. భూసమస్యలు, రోడ్లు, రేషన్ కార్డులు, తాగునీరు, పక్కాఇళ్లు తదితర అంశాలకు సంబంధించి అర్జీలు అందాయి. వీటన్నింటిని త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి. అభిషేక్, డీఆర్వో దయానిధి, ఏపీవో వి.ఎస్. ప్రభాకర్, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్ఎం రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, డీఎల్‌పీవో పీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

**బధిర క్రీడాకారుడికి ప్రోత్సాహం**

**గూడెంకొత్తవీధి:** రాష్ట్ర స్థాయి బధిర క్రీడా పోటీల్లో సత్తాచాటిన గిరిజన యువకుడు కందుల గిరిబాబుకు ప్రభుత్వ పరంగా అవసరమైన తోడ్పాటు, ప్రోత్సాహం అందిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గోపాలకృష్ణ అన్నారు. గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ తోటలగొంది గ్రామానికి చెందిన కందుల గిరిబాబు బధిరుడు. ఈయన ఏలూరు, విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించారు. వాలీబాల్, డిస్కోత్రో పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచారు.

షాట్‌పుట్ 16 కేజీల విభాగంలో తృతీయ స్థానం సాధించారు. 2023 ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరగనున్న జాతీయస్థాయి బధిర క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఈయన శుక్రవారం పాడేరులో ఐటీడీఏ పీవోను కలిశారు. ఐటీడీఏ పరంగా క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని పీవో హామీ ఇచ్చారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈప్రాంతానికి గుర్తింపు తేవాలని ఆయన ఆకాంక్షించారు.



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గోపాలకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న బధిర క్రీడాకారుడు కందుల గిరిబాబు

### క్రీస్తు బోధనలు ఆచరణీయం

**మహారాణిపేట(విశాఖ దక్షిణ):** భారతావనిలో అన్ని మతాలు సమానమేనని, అన్ని పండగలు అందరూ కలిసి చేసుకునే స్ఫూర్తి ఉందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీలు మన దేశంలో వైద్య,విద్యా రంగానికి ఎంతో సేవ చేశాయన్నారు. కోవిడ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ వేడుకలు జాగ్రత్తగా జరుపుకోవాలని అన్నారు. జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రేమ, ప్రేరణతోనే మతగురువులు దేశానికి సేవ చేశారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కూడా మిషనరీల సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం ప్రబోధకులు ఏసుపాదం బైబిల్లోని వాక్యాలను వివరించారు. క్రిస్మస్ కేకు కట్ చేశారు.



విశాఖలో కలెక్టర్ మల్లికార్జునకు కేక్ తినిపిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

## క్లుప్తంగా

### నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి బెన్నస్వామి

అరకులోయ రూరల్: నాడు–నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి బెన్నస్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో నాడు–నేడు పనులకు ప్రభుత్వం రూ.36.36లక్షలు మంజూరు చేసిందని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రమిల, వైస్ ప్రిన్సిపాల్ రమణ, సిబ్బంది తదితరులున్నారు.

### జిల్లాస్థాయి హాకీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

అనకాపల్లిటౌన్: జిల్లాస్థాయి హాకీ, బాల్‌బ్యాడ్మింటన్ సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకులు ఎస్.సూర్యారావు శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీన నక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో మెన్, ఉమెన్ హాకీ, జనవరి 3వ తేదీన చోడవరం బాలుర హైస్కూల్లో మెన్, ఉమెన్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9985530819, 8466016212 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

# పర్యాటక ప్రాంతం పరిశుభ్రంగా


బొర్రాలోని చెత్తచెదారం తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు


కొత్తపల్లి జలపాతం వెళ్లే మార్గంలో చెత్త తొలగిస్తున్న గ్రామస్తులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవతో స్పెషల్ డ్రైవ్
- పర్యాటక ప్రాంతాల్లో చెత్త చెదారాల తొలగింపునకు ప్రత్యేక చర్యలు

అనంతగిరి: ప్రకృతి అందాలకు నిలయం.. మన్య ప్రాంతం.. ఎటు చూసినా దట్టమైన వృక్షాలతో ఎత్తైన కొండలు.. పచ్చని పొలాలు....అందమైన జలపాతాలు.. చల్లటి ఆహ్లాదకర వాతావరణం దర్శనమిస్తోంది... మన్యం అందాలను తిలకించేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. ప్రకృతి అందాలను వీక్షించేందుకు రైలు, రోడ్డు మార్గాన మన్యానికి చేరుకుంటారు.. పర్యాటకులతో మన్యం కళకళలాడుతోంది..పర్యాటకులకు మంచి అనుభూతిని కలిగించేలా ప్రకృతి అందాలు దర్శనమిస్తున్నా..మరోవైపు పరిసరా ప్రాంతాలు చెత్తచెదారం నిండి నిరాశ పరుస్తున్నాయి. పర్యాటక ప్రదేశాల్లో అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తోంది. దీంతో పర్యాటకులు, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.. దీంతో పర్యాటక ప్రాంతాలను పరిరక్షించేందుకు పర్యావరణానికి విఘాతం కలగకుండా ఉండేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకున్నారు. పర్యాటక ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. పారిశుధ్య సిబ్బంది పర్యాటక ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు.

**ప్రకృతి అందాలకు ఫిదా**

మన్యంలోని సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతి అందాలను అస్వాదించేందుకు వచ్చే పర్యాటకులు, నిరాశతో వెనుదిరగకుండా ఆనందంగా గడిపివెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టారు. పర్యాటక ప్రాంతాల్లో చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రకృతి అందాలు విఘాతం కలుగుతుంది. రానున్న రోజుల్లో ప్లాస్టిక్ పెరిగే కొద్ది మరింత ప్రమాదం పొంచి ఉండడంతో అధికారులు ముందుచూపుతో చర్యలు చేపట్టారు. గతంలోని చెత్తచెదారం పేరుకుపోయి ఉన్న ప్రదేశాలు నేడు కళకళలాడుతున్నాయి. అల్లూరి జిల్లాలోని పాడేరు వంజంగిహిల్స్, మాడగడ హిల్, సీతమ్మ పర్వతం, లంబసింగి, తాంజంగి, కొత్తపల్లి జలపాతం, అరకులోయ మ్యూజియం, గార్డెన్, బొర్రాగుహలు, డుంబ్రిగుడ చాపరాయి, కటికి, చిట్టంపాడు, సరియా జలపాతాలు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌తో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

**ప్లాస్టిక్ నిషేధం**

పర్యాటక ప్రాంతాల పరిరక్షణకు కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నారు. పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధాలను పక్కాగా అమలుచేయాలని అధికారులను అప్రమత్తం చేశారు. పారిశుధ్యం పనులు చేపడుతూ మరోవైపు పర్యాటకులకు, స్థానికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

**ప్రకృతి అందాలు వర్ణనాతీతం**

పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు విశాఖపట్నం నుంచి వచ్చాను. పర్యాటక ప్రాంతాల్లో చెత్తచెదారం తొలగింపు చర్యలు చేపట్టడం చాలా సంతోషంగా ఉంది. ప్రకృతి అందాలు చాలా అందంగా కన్పిస్తున్నాయి.

– జాన్, పెందుర్తి పర్యాటకుడు

**విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ పనులు**



కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో మూడు రోజులుగా పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. అరకు–విశాఖ ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్తచెదారం తొలగింపు చర్యలు చేపట్టాం. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధించేలా ఆయా పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వాడితే చర్యలు చేపడతాం.

– శ్రీహర్షిత్, ఎంపీడీవో, అనంతగిరి

### సీఎం కప్ క్రీడాపోటీల తేదీలివే..

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి టోర్నీలో భాగంగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు తేదీలు, వేదికలు ఖరారు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆసక్తి కలిగిన మెన్, ఉమెన్ క్రీడాకారులు ఆయా క్రీడాంశాల్లో దిగువ పేర్కొన్న తేదీల్లో పాల్గొనవచ్చని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ తెలిపింది. విశాఖ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో టెన్నిస్ ఎంపిక పోటీలు 26న ఏయూ టెన్నిస్ కోర్టులో జరగనుండగా, 28న హాకీ ఎంపికలు నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. 28న పెదగంట్యాడ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో కబడ్డీ ఎంపికలు, 31న బాస్కెట్‌బాల్ ఎంపికలు ఏయూ గ్రౌండ్స్‌లో, ఫుట్‌బాల్ ఎంపికలు రైల్వే గ్రౌండ్స్‌లో జరగనున్నాయి. జనవరి 3న చోడవరం ఉన్నత పాఠశాలలో బాల్‌బ్యాడ్మింటన్ మెన్, ఉమెన్ ఉమ్మడి విశాఖ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. ఇక యోగా ఫేజ్ 2 పోటీలు 8నుంచి 14 ఏళ్ల లోపువారికి తిరుపతిలో 27న, 14+నుంచి 21ఏళ్లలోపు వారికి కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో 29న పోటీలు నిర్వహించనున్నారు.



### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలుశిక్ష


యలమంచిలి : మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు ఒక్కరోజు జైలు శిక్ష, మరో ఐదుగురికి రూ. 10 వేలు చొప్పున యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు శక్రవారం జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ దాసరి ఈశ్వరరావు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపటం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటాయని.. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ విధిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో మెరిసిన కొత్తమల్లంపేట విద్యార్థులు


పతకాలు సాధించిన కొత్త మల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు

నర్సీపట్నం: నింజాస్ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సబ్ జూనియర్ రెజ్లింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. గొలుగొండ మండలం కొత్తమల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్లో చదువుతున్న మామిడి ప్రవీణ్ 62 కిలోల విభాగంలో స్వర్ణ పతకం, సింగంపల్లి నాగ మహేంద్ర 48 కిలోల విభాగంలో క్యాంస పతకం సాధించారు. వీరు గత కొంత కాలంగా నర్సీపట్నం నింజాస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. క్రీడాకారులు, పీడీ దేవిని హెచ్ఎం ప్రసాద్ అభినందించారు.

### కరాటే పోటీల్లో ఆరుగురికి పతకాలు


ఆల్ ఇండియా కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

నర్సీపట్నం: బెనారస్ హిందూ యూనివర్శిటీలో జరిగిన ఏడో అమ్మ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన ఆరుగురు విద్యార్థులు పతకాలు సాధించారు. కె.ప్రద్యుమ్న సిల్వర్, ఆర్.హేమంత్ గోల్డ్‌మెడల్, కె.బి.ప్రేమ్‌కుమార్ గోల్డ్, కె.పూర్ణిమ సిల్వర్ మెడల్, ఎ.మనోజ్‌కుమార్ బ్రాంజి, ఎల్. శోభిత్ సిల్వర్ మెడల్ సాధించారు. క్రీడాకారులు, కోచ్ చిన్నను ఆర్‌పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, కె.కిషోర్ అభినందించారు.

### సీఎం కప్ కరాటే ట్రోఫీ ఆవిష్కరణ

విశాఖ స్పోర్ట్స్ : సీఎం కప్ కరాటే చాంపియన్‌షిప్‌ను ఫిబ్రవరి తొమ్మిది నుంచి నాలుగు రోజుల పాటు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విజేతలకు అందించే ట్రోఫీని డైట్ విద్యాసంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను రాజధానిగా చేస్తున్న నేపథ్యంలో పలుదేశాల జట్లతో కరాటే పోటీలు నిర్వహించడం ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వర్ధమాన హీరో ఉపేంద్ర, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి పాల్గొన్నారు.

# హక్కులపై అవగాహన అవసరం

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్
- వినియోగదారుల చైతన్య సదస్సులో సూచన


హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

పాడేరు రూరల్ : కొనుగోలు, సేవలు పొందే ప్రతిఒక్కరూ వినియోగదారులేనని, వీరంతా హక్కులపై అవగాహన పొందాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో వినియోగదారుల క్లబ్బులు ఏర్పాటు చేసి వస్తువుల నాణ్యతను పరిశీలించాలని సూచించారు. వినియోగదారుల చట్టంలో వినియోగదారుల హక్కులతో పాటు తయారీదారుల బాధ్యతలు కూడా ఉన్నాయన్నారు. చట్ట ప్రకారం మోసపూరిత ప్రకటనలు, తప్పుడు కొలతలు, తప్పుడు వివరాలు ప్రకటిస్తే శిక్షర్హులవుతారన్నారు. రేషన్ దుకాణాల్లో సరఫరా చేసే బియ్యాన్ని చాలామంది కిలో రూపాయికి కొనుగోలు చేసి మార్కెట్‌లో విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. మన్యంలోని అన్ని వారపు సంతల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రేషన్ బియ్యం అమ్మిన, కొనుగోలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రేషన్ బియ్యం సంతల్లో అమ్ముతూ పట్టుడితే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామన్నారు. ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనేముందు వాటి నాణ్యత, బరువు, ధర, బ్రాండ్ తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. వస్తువులు కొనేముందు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. వస్తువులో నాణ్యత లేకపోయినా, అధిక ధరలకు విక్రయించినా వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ వి.అభిషేక్ మాట్లాడుతూ దుకాణాల్లో, షాపింగ్ మాల్స్‌లో ఏ చిన్న వస్తువు కొన్నా తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. బిల్లులో వస్తువు యొక్క పూర్తి వివరాలతో పాటు ట్యాక్స్ వివరాలు లేకుంటే చెల్లదన్నారు. అలాంటి ఫిర్యాదులతో వస్తే సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. వినియోగదారుల హక్కుల, చట్టాలపై గ్రామాల్లో విద్యార్థులు ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శివ ప్రసాద్, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, డీఈవో డాక్టర్ పి. రమేష్, జిల్లా ఆహార భద్రత అధికారి వేణుగోపాల్, లీగల్ మెట్రాలజీ అధికారి అనురాధ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయ్, వినియోగదారుల సేవా సంఘం ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా.. ఉల్లాసంగా

- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబురాజు


మార్చ్ పాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

యలమంచిలి: స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఆరో అంతర్ జిల్లాల సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే కన్నబాబురాజు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ఇక్కడ నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్ వంటి పోటీలను తన హయాంలో అతిథ్యమిచ్చాన, క్రీడల ప్రోత్సాహంలో తాను ఎప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. ప్రతిభ క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనకాపల్లి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జి.ప్రసాద్‌రాజు మాట్లాడుతూ మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించి ప్రతిభ క్రీడాకారులను రాష్ట్ర స్థాయి వాలీబాల్ బాలబాలికల జట్లకు ఎంపిక చేస్తామన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి వచ్చిన బాల బాలికలు విభాగంలో సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడాకారులు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. క్రీడలపై సత్ప్రవర్తనతో మెలుగుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకుని వాలీబాల్ ఆడారు. ఏపీ వాలీబాల్ అసోసియేషన్ కోశాధికారి బ్రహ్మాజీ, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, దూది నరసింహమూర్తి, గంధం శివ, పిట్టా సత్తిబాబు, కౌన్సిలర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

### రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తుమ్మపాల విద్యార్థులు


రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తుమ్మపాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

అనకాపల్లి రూరల్: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో తుమ్మపాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 19 వరకూ తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ –17 ఖోఖో పోటీల్లో తుమ్మపాల నుంచి పి.జయవర్ధన్, ఆర్.రాంచరణ్, ఎం.ప్రసన్న, మణిగణేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిలో జయవర్ధన్, రాంచరణ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ –14 బాలుర విభాగంలో కేకే లక్ష్మీధర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించగా, బాలికల విభాగంలో కె.లహరి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. అండర్ –17 కబడ్డీ పోటీల్లో కె.భానుప్రకాశ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, పీడీ డీవీఎస్‌కే నాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు, కోచ్ పీలా వీరునాయుడు తదితరులు అభినందించారు.

# ముమ్మరంగా వలిసె నూర్పిళ్లు


పంట నూర్పులు చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మండలంలోని గిరిజన రైతులు సాగుచేసిన వలిసె పంట చేతికందడంతో కోత కోసి ముమ్మరంగా నూర్పులు చేపడుతున్నారు. మండలంలోని తూటంగి, అరమ,లైగండ, గుంటసీమ, గుంటగన్నెల, కితలంగి, కురిడికొర్రాయి తదితర గ్రామాల్లో ముమ్మరంగా వలసె కోతలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 70 శాతం వలిసె కోతలు పూర్తయినట్టు, మరో 30 శాతం కోతలు, నూర్పులు వారం రోజుల్లో పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. వారపు సంతల్లో వలిసె కిలో రూ.45 వరకు కొనుగోలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరగవచ్చని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): సర్వేజనా సుఖినోభవంతు(సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ)హైదరాబాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి విశిష్ట ప్రతిభా పురస్కారాలు–2023 ప్రదానం చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, సమాజ సేవకులు, కార్మికులు, కర్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యులు, మేధావుల ప్రతిభ, సేవలను గుర్తించి వారికి ఘనంగా సత్కరిస్తామన్నారు. హైదరాబాద్ వేదికగా 2023 జనవరి 8న ఈ కార్యక్రమం జరుగుతుందనిన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారు, సేవలందిస్తున్న వారు తమ వివరాలతో పాటు సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, జిరాక్స్ కాపీలతో 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జతచేసి ఈ నెల 31లోగా సర్వేజనా సుఖినోభవంతు, డోర్ నంబర్ 1–20–109, మొదటి అంతస్తు, తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్–15కు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9652347207లో సంప్రదించవచ్చు.

# కంచి కామకోటి పీఠాధిపతి రాక నేడు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ టి రవిరాజు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): కంచి కామకోటి పీఠాధిపతి శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి ఈ నెల 24న విశాఖ నగరానికి రానున్నారని శంకర మఠం కార్యనిర్వాహక వర్గం అధ్యక్షుడు డాక్టర్ టి. రవిరాజు తెలిపారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మార్చినుంచి స్వామి తన విజయాత్రను కొనసాగిస్తున్నారని చెప్పారు. శనివారం సాయంత్రం 6 గంటలకు జాతీయ రహదారి శాంతిపురం వద్ద వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తబృందంచే శోభాయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. విజయేంద్ర సరస్వతి శంకరమఠంలో మూడు వారాల పాటు ఉంటారని, ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి రోజూ మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం, త్రికాలర్చన, విశేష అర్చనలు నిర్వహిస్తారన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, శంకరమఠం సభ్యులు శివప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, సలహాదారుడు కేవీ రామ్మూర్తి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## స్థిరంగా వాయుగుండం

- దక్షిణకోస్తా, సీమలకు తేలికపాటి వర్షాలు
- జి.మాడుగులలో 4.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత



సాక్షి, విశాఖపట్నం/సాక్షి, పాడేరు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం స్థిరంగా కొనసాగుతోంది. ఇది తూర్పు ఈశాన్య దిశగా గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఈ వాయుగుండం తమిళనాడులోని నాగపట్నానికి తూర్పున 570 కి.మీ.లు, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 600 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది అదే ప్రాంతంలో నెమ్మదిగా పశ్చిమ నైరుతి దిశలో కదులుతూ రానున్న 24 గంటల్లో శ్రీలంక మీదుగా కొమరిన్ వైపు వెళుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం రాత్రి నివేదికలో తెలిపింది. మరోవైపు రాష్ట్రంపైకి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రానున్న రెండు రోజులు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఉత్తర కోస్తాంధ్రలో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది.

**క్షీణిస్తున్న రాత్రి ఉష్ణోగ్రతలు...**

మరోవైపు రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా క్షీణిస్తున్నాయి. ప్రజలను చలి గజగజ వణికిస్తోంది. గురువారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 4.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అరకు 4.9 డిగ్రీలు, పాడేరు 5.6 డిగ్రీలు, కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా) 11.1డిగ్రీలు, గొలుగొండ (అనకాపల్లి జిల్లా) 12.3 డిగ్రీలు, బెలుగుప్ప (అనంతపురం) 12.3 డిగ్రీలు, పెదతిప్పసముద్రం (అన్నమయ్య) 12.3 డిగ్రీలు, మంత్రాలయం (కర్నూలు) 12.7డిగ్రీలు, రామభద్రాపురం (విజయనగరం) 12.7డిగ్రీలు, సోమల (చిత్తూరు) 13.1డిగ్రీలు, టి.నర్సాపురం (ఏలూరు) 14డిగ్రీలు, మద్దూరు (వైఎస్సార్ జిల్లా) 14 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# మార్గదర్శి చిట్‌ఫండ్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తోంది

- ప్రజల నుంచి సేకరిస్తున్న సొమ్మును అనుబంధ కంపెనీలకు మళ్లిస్తోంది
- ఇలా చేయడం చట్టాన్ని, ప్రజలను మోసం చేయడమే
- ఇటీవల చాలా కంపెనీలు ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాయి
- అలాంటి పరిస్థితి ప్రజలకు రాకూడదనే మార్గదర్శి విషయంలో చర్యలు
- రిజిస్ట్రార్‌కు సమర్పించాల్సిన వివరాలనూ ఇవ్వడంలేదు
- చట్టమే వర్తించదన్నట్లు మార్గదర్శి వ్యవహరిస్తోంది
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి : చిట్‌ఫండ్ చట్టం నిబంధనలను అనుసరించనందుకు తమకు ఎలాంటి పెనాల్టీ విధించకుండా, అధికారులు చట్ట నిబంధనల ప్రకారం నడుచుకునేలా ఆదేశించాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాల్లో వాదనలు శుక్రవారం ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

తమ వ్యవహారంలో అధికారులు నిబంధనల మేరకు నడుచుకునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ అధీకృత అధికారి బి.శ్రీనివాసరావు దాఖలు చేసిన పిటిషన్, అనుబంధ వ్యాజ్యాలపై జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం విచారణ జరిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటం వల్లే సోదాలు చేపట్టామన్నారు. ఇటీవల చాలా కంపెనీలు ప్రజల నుంచి సేకరిస్తున్న సొమ్ము విషయంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని, అలాంటి పరిస్థితులు ప్రజలకు రాకూడదన్న ఉద్దేశంతోనే మార్గదర్శి వ్యవహారంలో చర్యలు చేపట్టామన్నారు. ప్రజల నుంచి చిట్ రూపంలో సేకరించిన డబ్బును ఓ ప్రత్యేక ఖాతాలో జమ చేయాలని, మార్గదర్శి అందుకు విరుద్ధంగా కార్పొరేట్ ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. ఆ సొమ్మును ఉషాకిరణ్ మూవీస్, ప్రియా ఫుడ్స్, ఉషోదయా పబ్లికేషన్స్, రమాదేవి ట్రస్ట్ వంటి అనుబంధ కంపెనీలకు, ఇతర అవసరాలకు మళ్లిస్తోందని, ఎన్నో ఏళ్ల నుంచి ఈ తంతు సాగుతోందని నివేదించారు. ఇది ప్రజలను, చట్టాన్ని మోసం చేయడమేనన్నారు. ప్రతి చిట్ ఆస్తి, అప్పుల పట్టీని రిజిస్ట్రార్‌కు సమర్పించాలని, మార్గదర్శి ఆ పని కూడా చేయడంలేదని చెప్పారు. ప్రజలు ఏ రకంగానూ మోసపోకూడదనే ఉద్దేశంతోనే మార్గదర్శి రికార్డులన్నింటినీ పరిశీలిస్తున్నామని, చిట్‌ఫండ్ కంపెనీ రికార్డులను పరిశీలించే అధికారం అధికారులకు ఉందని తెలిపారు. మార్గదర్శి హెడ్ ఆఫీస్ హైదరాబాద్‌లో ఉంది కాబట్టి ఏపీలోని ఆ సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేయకూడదనడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ చట్ట నిబంధనలూ వర్తించవన్నట్లు మార్గదర్శి వ్యవహరిస్తోందన్నారు. కొత్త చిట్ ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ ప్రతిపాదనలు సమర్పించినప్పుడు పాత చిట్ రికార్డులు పరిశీలించే అధికారం రిజిస్ట్రార్‌కు ఉందన్నారు. కొత్త చిట్‌కు అనుమతివ్వాలా లేదా అన్నది పూర్తిగా రిజిస్ట్రార్ విచక్షణపై ఆధారపడి ఉంటుందన్నారు. చిట్‌కు అనుమతివ్వాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించడానికి వీల్లేదన్నారు. ప్రజల క్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు కక్ష సాధింపు ఎలా అవుతుందని అన్నారు. రికార్డులు అడుగుతుంటే కుంటి సాకులతో తప్పించుకుంటున్నారని వివరించారు. రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ వద్ద అన్ని డాక్యుమెంట్లను సమర్పించిన తరువాత వ్యాపారం కొనసాగించవచ్చని చెప్పారు. ఈ కేసులో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని ఆయన కోర్టును అభ్యర్థించారు.

అంతకు ముందు మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. రిజిస్ట్రార్ నిబంధనల ప్రకారం నడుచుకోవడంలేదన్నారు. కార్పొరేట్ ఆఫీస్, బ్రాంచ్ ఆఫీసుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను కోరజాలరన్నారు. చిట్ డబ్బుపై సెక్యూరిటీ మొత్తాన్ని రిజిస్ట్రార్ వద్ద జమ చేస్తున్నామని తెలిపారు. ఫోర్‌మెన్ సెక్యూరిటీ ఇవ్వాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. ఎలాంటి ఫిర్యాదు లేకపోయినా అధికారులు సోదాల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ముందుగా నోటీసు ఇవ్వకుండా, కారణాలు చెప్పకుండా కొత్త చిట్‌కు అనుమతిని తిరస్కరించడం చట్ట విరుద్ధమన్నారు. ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

## 'పోటీ ప్రపంచంలో ట్యాబ్‌లు ఎంతో అవసరం'

కార్వేటినగరం: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ట్యాబ్‌లు ఎంతో అవసరమని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చెప్పారు. చిత్తూరు జిల్లాలోని మండల కేంద్రం కార్వేటినగరంలోని ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ట్యాబ్‌లను శుక్రవారం ఎంపీపీ లత ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కుల, మత, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు విద్య ఎంతో అవసరమని గుర్తించిన సీఎం వైఎస్ జగన్ డిజిటల్ విప్లవం తీసుకొచ్చారని చెప్పారు. ట్యాబ్‌లలో అడ్వాన్స్ సిలబస్‌ను పొందుపరిచారని, ట్యాబ్‌ల పట్ల తల్లిదండ్రులు కంగారు పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను ప్రతి ఇంటా ఆరాధ్యదైవంగా భావిస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌పై పాటపాడిన విద్యార్థి ప్రమోద్‌కుమార్‌ను డిప్యూటీ సీఎం సత్కరించారు.

# కరువులో బాబు రికార్డు

- ఆయన పాలనలో అంతా కరువు
- వ్యవసాయాన్ని లాభదాయకంగా చేసిన సీఎం జగన్
- ఈ మూడున్నరేళ్లలో ఈ రంగంపై ప్రత్యక్షంగా రూ.85,295.98 కోట్లు ఖర్చు
- అగ్రిమిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి



సాక్షి, అమరావతి : వ్యవసాయం దండగా అని చంద్రబాబు అంటే, వ్యవసాయ రంగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాభదాయకంగా చేశారని అగ్రిమిషన్ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మించిన సంక్షేమం దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఉందా అని ఆయన ప్రశ్నించారు. జాతీయ రైతు దినోత్సవం (మాజీ ఉపప్రధాని చరణ్‌సింగ్ పుట్టిన రోజు డిసెంబర్ 23) సందర్భంగా శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నాగిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

కరువులో చంద్రబాబు రికార్డు సృష్టించారు. బాబు పాలనలో అంతా కరువు. సీఎం జగన్ పాలనలో వ్యవసాయం పండుగలా సాగుతోంది. మూడున్నరేళ్లలోనే వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతులకు ప్రత్యక్ష బదిలీ ద్వారా రూ.85,295.98 కోట్లు చేయగా.. పరోక్షంగా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు వెచ్చించింది రూ.51,662 కోట్లు. నిజానికి.. 2022 జగన్నామ సంక్షేమ సంవత్సరం. ఈ మూడున్నరేళ్లలో రైతులకు ఎంతో మేలు జరిగింది. రైతుభరోసా కేంద్రాలతో రైతులకు అండగా నిలిచారు. ఉద్యాన పంటల సాగు కూడా 40శాతం పెరిగింది. పండ్లు, కూరగాయాల సాగులో ఏపీ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. చంద్రబాబు హయాంలో 2014–19 మధ్య 1,623 కరువు మండలాలు ఉంటే ఇప్పుడు ఒక్కటి కూడా లేదు. సాగు విస్తీర్ణం బాబు హయాంలో కన్నా ఇప్పుడే ఎక్కువ.

**రైతులను నిలువునా ముంచిన బాబు**

- నిజానికి రూ.87,612 కోట్లు రుణమాఫీ చేస్తానంటూ చంద్రబాబు అన్నదాతలను నిలువునా ముంచాడు. చివరకు ఇచ్చింది రూ.15 వేల కోట్లే.
- అదే సీఎం జగన్ ఒక్క వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారానే మూడున్నరేళ్లలో ప్రభుత్వం రూ.25,971.63 కోట్లను రైతన్నలకు అందించింది.
- ఇక టీడీపీ ఐదేళ్లలో బీమా కింద చెల్లించింది కేవలం రూ.3,411 కోట్లు. అదే సీఎం జగన్ ఈ మూడున్నరేళ్లలో ప్రభుత్వం చెల్లించిన పంటల బీమా పరిహారం రూ.6,685 కోట్లు.
- సున్నా వడ్డీ విషయంలోనూ గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,180 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును పూర్తిగా చెల్లించడమే కాకుండా, 73.88 లక్షల మంది రైతులకు మూడున్నరేళ్లలో మొత్తం రూ.1,835 కోట్లు ఇచ్చింది సీఎం జగన్ ప్రభుత్వం.

**పాఠ్యాంశంగా గ్రామ సచివాలయాలు**

సీఎం జగన్ మానస పుత్రిక అయిన గ్రామ సచివాలయ వ్యవస్థను లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, ముస్సోరిలో పాఠ్యాంశంగా చేర్చారు. రైతుభరోసా కేంద్రాలను అనేక రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సందర్శించి ఈ వ్యవస్థను ప్రశంసించారు. ఈ–క్రాప్, ఈకేవైసీ అమలు విధానాన్ని స్వయాన దేశ ప్రధానే దేశమంత అమలుచేస్తే బాగుంటుందని ప్రకటించటం రాష్ట్రానికే గర్వకారణం.

## కోవిడ్ బీఎఫ్‌-7 వేరియంట్‌పై ఆందోళన వద్దు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని

సాక్షి, విశాఖపట్నం/సింహాచలం (పెందుర్తి)/మహారాణిపేట/దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : ఏపీలో ఇప్పటివరకు కోవిడ్ బీఎఫ్‌–7 వేరియంట్ ఎక్కడా కనిపించలేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. అయితే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విశాఖ జిల్లా పెందుర్తిలో రూ.2.59 కోట్లతో 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన సీహెచ్‌సీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. విడదల రజిని మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇప్పటికే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**గ్లోబల్ హెల్త్ సమ్మిట్ బ్రోచర్ ఆవిష్కరణ**

జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్ బ్రోచర్‌ను ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో మంత్రి విడదల రజిని ఆవిష్కరించారు. గ్లోబల్ హెల్త్ సమ్మిట్ చైర్మన్, రిటైర్డ్ డీఎంఈ ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ టి.రవిరాజ్, సమ్మిట్ మహిళా విభాగం చైర్మన్ డాక్టర్ టి.రాధ తదితరులు పాల్గొన్నారు. కాగా, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుక్ మాండవీయ వివిధ రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులతో దేశంలో కోవిడ్ వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి విడదల రజిని జీవీఎంసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రజిని

**ఉత్తరాంధ్రలో టీడీపీకి సీట్లు కాదుకదా.. ఓట్లు కూడా రావు..**

పరిపాలనా రాజధానిగా విశాఖపట్నంను వ్యతిరేకిస్తున్న తెలుగుదేశం పార్టీకి ఉత్తరాంధ్రలో రాబోయే ఎన్నికల్లో సీట్లు కాదుకదా.. ఓట్లు కూడా రావని మంత్రి రజిని ఎద్దేవా చేశారు. మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఉత్తరాంధ్రను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శరవేగంగా అభివృద్ధి చేస్తుంటే అడ్డుకోవాలని చంద్రబాబు అండ్ కో ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల పట్ల అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో లేనప్పుడు మరోలా చంద్రబాబు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు రాష్ట్రంలో ఉనికిని కోల్పోయారని.. ఇప్పుడు మరో రాష్ట్రంలో టీడీపీ బలపడుతున్నదని ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని రజిని విమర్శించారు.

## ఐటీ ఫైలింగ్ ఇక సులభతరం




మాట్లాడుతున్న దుర్గేష్

ఆదోని అర్బన్: ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్‌ను సులభతరం చేసేందుకు అన్ని ఆప్షన్‌లు ఉన్న సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకున్నట్లు ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సమ్రాట్ తెలిపారు. శుక్రవారం స్థానిక ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో ఆదాయ పన్ను చెల్లింపుదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్, ఆధార్, ఓటర్ కార్డులు బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసే ఇబ్బందులు తొలగించేందుకు ఒకే ఫార్మాట్‌ను రూపొందిస్తున్నామన్నారు. బ్యాంకు, ఆధార్ కేంద్రాల చుట్టూ ఎవరూ తిరగాల్సిన అవసరం ఉండబోదన్నారు. అనంతరం పన్ను చెల్లింపుదారులకు సందేహాలను నివృత్తి చేశారు. స్థానిక ఆదాయ పన్నుశాఖ అధికారి స్టెల్లారోసలీండ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐటీశాఖ జాయింట్ కమిషనర్ అనీష్ కాన్, డిప్యూటీ కమిషనర్ రాజారెడ్డి, ట్యాక్స్ బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు విశ్వనాథరెడ్డి, అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు విట్టా సురేష్‌బాబు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేంద్ర, రాష్ట్రకమిటీ సభ్యులు డాక్టర్ గోపీనాథ్, కృష్ణమూర్తి, స్థానిక సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వెంకటేష్, వ్యాపారవేత్త సోమశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇస్తోందని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు ఈ–శ్రామ్ గుర్తింపు కార్డు కోసం సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్డుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: సూసైడ్ నోట్ రాసి, ఎలుకల మందు తిని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి ఎమ్మిగనూరు పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. పట్టణంలోని సున్నం బట్టీ వీధిలో నివాసం ఉంటున్న ఎస్‌ఎండీ మస్తాన్‌వలీ రెడీమేడ్ దుస్తుల దుకాణం నిర్వస్తున్నాడు. కొద్ది రోజులుగా భార్య తబ్సుం, అత్త రజియా కలిసి వేధిస్తున్నారని వలీ చెప్పారు. కుమార్తెకు వేరే పెళ్లి చేస్తానని రజియా బెదిరించారని, తన బిడ్డను సైతం వేరు చేయాలని చూస్తున్నారన్నారు. దీంతో శుక్రవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. షాప్‌లో ఉన్న యువకులు మస్తాన్‌వలీను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- జాతీయ రహదారులపై హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలి
- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.కోటేశ్వరరావు




మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే సంతోష్‌నగర్, నన్నూరు టోల్‌ప్లాజా, టీవీ9 కాలనీ తదితర పాయింట్ల సమీపంలో జాతీయ రహదారులపై హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. సీక్యాంపు, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో బస్‌బే, బస్ స్టాప్‌ల ఏర్పాటుకు పోలీసులు, ఆర్టీసీ, రవాణా శాఖాధికారులు జాయింట్ సర్వే చేయాలన్నారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో మునిసిపల్, పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. వారంలోపు అన్నిచోట్లా సీసీ కెమెరాలు ఉండాలని ఆదేశించారు. నంద్యాల చెక్‌పోస్టు, మద్దూర్ నగర్, బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, రాజ్‌విహార్, కలెక్టరేట్ సమీపంలో సర్కిళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మునిసిపల్, ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ఎల్లమ్మ గుడి దగ్గర జన సామర్థ్యాన్ని తగ్గించేందుకు వీలుగా డీపీఆర్‌ను సిద్ధం చేసినట్లు పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం తెలిపారు. జాతీయ రహదారులపై అవసరం లేని స్పీడు బ్రేకర్లను తొలగించాలని ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులకు కలెక్టర్ సూచించారు. వాహనాల్లో వెనుక సీట్లలో ఉన్న వారు కూడా సీటు బెల్టు పెట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తనిధి కేంద్రాలను కూడా ఐరాడ్‌కు అనుసంధానం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యకు సూచించారు. కార్యక్రమంలో డీటీసీ శ్రీధర్‌తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కర్నూలుకు మరో పోలీస్‌స్టేషన్

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్పీ ఆదేశం




డీఎస్పీ కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కర్నూలు: విస్తీర్ణం పెరుగుతుండంతో కర్నూలు అర్బన్‌లో మరో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ కర్నూలు డీఎస్పీ కె.వి.మహేష్‌కు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం కర్నూలు నగరంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు అర్బన్‌లోని కొన్ని కాలనీలతో పాటు కర్నూలు మండలంలోని గ్రామాలు ప్రస్తుతం కర్నూలు అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయన్నారు. విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున ప్రజల సంక్షేమం దృష్ట్యా రెండో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి అవసరం ఉందన్నారు. కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాలపై సమీక్ష నిర్వహించారు. కేసుల పురోగతిపై ఆరా తీసి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**సేఫ్ సిటీ కోసం గస్తీ ముమ్మరం**

సేఫ్ సిటీలో భాగంగా రాత్రిపూట గస్తీని పటిష్టం చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఎస్పీ సూచించారు. కర్నూలు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ పటిష్టంగా ఉండాలంటే నేరాల నియంత్రణ కోసం విధులు అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్‌తో పాటు సీఐలు శ్రీనివాసుల, తబ్రేజ్, శ్రీనివాసరెడ్డి, రామలింగయ్య, శంకరయ్య, ఎస్ఐలు మల్లికార్జున, విష్ణు నారాయణ, పీరయ్య పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రిలో 'కోవిడ్' ఏర్పాట్లు

- పాత గైనిక్ విభాగం పునరుద్ధరణ
- అందుబాటులోకి రానున్న వంద పడకలు

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్–19 నాలుగో వేవ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇంకా ఒక్క కోవిడ్ కేసు కూడా నమోదు కాలేదన్నారు. చైనాలో విజృంభిస్తున్న దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. ఆసుపత్రిలోని పాత గైనిక్ విభాగాన్ని పునరుద్ధరించి అందులో వంద పడకలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పడకలన్నింటికీ ఆక్సిజన్ పైప్‌లైన్ ఉందని, ఆక్సిజన్ ఫ్రైజర్ ఎలా ఉందో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇంకా కేసులు పెరిగితే గతంలో మాదిరిగా వివిధ విభాగాల్లో ప్రాధాన్యత వారీగా ఏర్పాట్లు చేస్తామన్నారు. జ్వరపీడితులు, కోవిడ్ లక్షణాలతో ఎవ్వరైనా వస్తే ఓపీ నెం.99లో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోవిడ్ రోగులకు ఆపరేషన్ చేయాల్సి వస్తే వారికోసం ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన మందులు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, వైద్యపరికరాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో అనెస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ డాక్టర్ కొండా రెడ్డి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీరాములు, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ, టీబీసీడీ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరావు, క్యాన్సర్ హెచ్‌వోడీ డాక్టర్ ప్రకాష్, నోడల్ అధికారి డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రనాథ్‌రెడ్డి

## కులమతాలకు అతీతంగా కలిసి ఉండాలి

- కమాండెంట్ రవిశంకర్

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్ అన్నారు. శుక్రవారం బెటాలియన్ క్యాంప్‌లో క్రిస్మస్ వేడుకలకు రవిశంకర్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. సిబ్బంది ఏర్పాటు చేసిన క్యాండిల్ లైటింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనాలపై బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కోవిడ్ కొత్త వైరస్ విస్తరిస్తున్నందున పటాలం సిబ్బంది అందరూ తప్పనిసరిగా మాస్కు ధరించి విధులకు హాజరుకావాలన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ పి.రవికిరణ్‌తో పాటు బెటాలియన్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



క్యాండిల్ లైటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న కమాండెంట్ రవిశంకర్ దంపతులు

# క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పూర్తి చేయాలి

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితా సవరణలో భాగంగా స్పెషల్ సమ్మరీ రివిజన్–2023లో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌ను ఈ నెల 24వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా సవరణను ప్రకటించనున్న నేపథ్యంలో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌ను కచ్చితంగా బూత్ లెవల్ అధికారులతో పూర్తి చేయించాలని ఆర్‌డీఓలు, తహసీల్దార్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వివిధ రెవెన్యూ అంశాలపై జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓటర్లు, మరణించిన వారు, నియోజకవర్గాల మార్పు, చిరునామాల మార్పు తదితర వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి డిస్పోజ్ చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్ల దరఖాస్తులపై పరిశీలన చేసి అర్హులైన వారికే ఓటు హక్కును కల్పించాలన్నారు. ఇక వ్యవసాయ, వ్యవసాయేతర భూములు జిల్లాలో ఎన్ని ఎకరాల్లో ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఆర్‌డీఓలను ఆదేశించారు. 139 గ్రామాల్లో ఎస్సీ కులస్తుల కోసం శ్మశానాలను నిర్మించాల్సి ఉందని, ఇందుకోసం అవసరమైన స్థలాలను వారంలోపు గుర్తించి కేటాయించాలని తహసీల్దార్లకు సూచించారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ..జిల్లాలో కొత్తగా రేషన్ కార్డుల కోసం 3251మంది దరఖాస్తు చేసుకోగా 1298 మంది కార్డులను డౌన్‌లోడ్ చేశామని, వారంరోజుల్లోపు మిగిలిన వారి కార్డులను డౌన్‌లోడ్ చేయాలన్నారు. రీసర్వేలో భాగంగా భూ హక్కుపత్రాలు రాగానే పంపిణీ చేసేందుకు సంబంధిత మండలాల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు డి.హరిప్రసాద్, మోహన్‌దాస్ పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు మారుపేరు ఏబీవీపీ

- రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్

కర్నూలు సిటీ: ఏబీవీపీ (అఖిల భారత విద్యార్థి పరిషత్) క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలు ఏక్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో శుక్రవారం ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను ఆయన ప్రారంభించారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి తనకు ఏబీవీపీతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. తాను ఓ మ్యాగజైన్ కూడా నిర్వహించినట్లు చెప్పారు. రాజకీయంగా తాను ఏ పార్టీలో ఉన్నా ఏబీవీపీపై ఉన్న అభిమానాన్ని వదులుకోబోనని తెలిపారు. ఈ సభలో ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్ల, ఏబీవీపీ ప్రతినిధులు ఆశిష్ చౌహాన్, పార్థసారథి, నాగఫణిశాస్త్రి, మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ రాజశేఖర్‌లు పాల్గొని ప్రసంగించారు.



మహాసభలను ప్రారంభిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్

**ఏకగ్రీవంగా రాష్ట్ర కమిటీ ఎంపిక**

ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా మురళీధర్ రావు(ఎస్‌కే యూనివర్సిటీ ప్రొఫెసర్), సూలురు యాచేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రాము ప్రకటించారు. మహాసభల్లో పాల్గొనేందుకు శనివారం కేంద్ర మంత్రి వి.మురళీధరన్ రానున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు.